కూలీలకు ఉపాధి.. గ్రామాల్లో అభివృద్ధి

- 2022-23లో రూ.19 కోట్ల పనులు పూర్తి
- 2023-24లో రూ.37.90 కోట్లతో బడ్జెట్

ఏలూరు రూరల్: గత ఏడాది ఏలూరు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాయి. ఉపాధి పథకం నిబంధనల ప్రకారం కేంద్రం మంజూరు చేసే బడ్జెట్ మొత్తంలో రూ.100కు కూలీలకు రూ.60, మెటీరియల్‌కు రూ.40 కేటాయించాలి. 2022-23 సంవత్సరంలో రూ.19 కోట్ల పనులు పూర్తి చేశారు. ఇందులో రూ.11.84 కోట్లు కూలీలు వేతనాల రూపంలో అందుకున్నారు. రూ.7.24 లక్షలతో సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య శ్రీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు.

ఐదు లక్షలకుపైగా పని దినాలు

వెంకటాపురం, చొదిమెళ్ల, సత్రంపాడు, తంగెళ్ల మూడి, పోణంగి, కొమడవోలు, శనివారపుపేట గ్రామాలు నగర కార్పొరేషన్‌లోనికి విలీనం కావడం వల్ల కూలీల సంఖ్య 18 వేలు నుంచి 14 వేలకు తగ్గిపోయింది. మిగిలిన 15 గ్రామాల్లో 14,294 మంది కూలీలకు 5,09,502 రోజులు పని కల్పించారు. ఫలితంగా ఒక్కొక్క కుటుంబం సరాసరి 100 రోజులకు 59 రోజులు ఉపాధి పొందారు. ఒక్కొక్క కూలీ రోజుకు సరాసరి రూ.232 వేతనం అందుకున్నారు. 2022-23 సంవత్సరంలో ఒక్కో కుటుంబం రూ.13,670 నుంచి రూ.23,200 వరకు వేతనాలు అందుకున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి కాలంలో సైతం ఏలూరు మండలంలో 18 వేల మంది కూలీలకు ఉపాధి కల్పించారు. మొత్తంగా రూ.12.69 కోట్ల వేతనాలు పొందారు. 2022-23 సంవత్సరంలో సైతం అధికారులు ఇదే ఫలితాన్ని చూపారు.



మాదేపల్లి వద్ద చెరువు పూడిక తీస్తున్న కూలీలు (ఫైల్)



చొదిమెళ్లలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

పక్కా ప్రణాళికతో పనులు



ఉపాధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. కరోనా కష్టకాలంలో సైతం రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉపాధి పనులు చేపట్టింది. ఫలితంగా గ్రామీణ ప్రజలకు ఉపాధి దొరకడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి పనులు కూలీల వరకే పరిమితమయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టిన అభివృద్ధి బాట పట్టించారు.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

బడ్జెట్ పెంచుకుంటున్నాం



గత ఏడాది చేపట్టిన ఉపాధి పనుల వల్ల నేటికీ రూ.57 లక్షల మెటీరియల్ పేమెంట్ అదుబాటులో ఉంది. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. ఏడు గ్రామల విలీనం వల్ల ఏలూరు మండలంలో కూలీల సంఖ్య తగ్గినప్పటికీ గత ఏడాది రూ.19 కోట్లతో బడ్జెట్ రూపొందించాం. ఫలితం రాబట్టాం. 2023-24లో సైతం రూ.37.90 కోట్లతో బడ్జెట్ రూపొందించాం. ఇందులో కూలీలకు వేతనాలకు రూ.22.74 కోట్లు, మెటీరియల్‌కు రూ.15.16 కోట్లు కేటాయించాం.

– కిషోర్, ఏపీఓ

ప్రతి ఇంటా.. పథకాల పంట

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరులో 85వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాల పంట పండుతోందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తున్న ఏకైక నాయకులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో 85వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వన్‌టౌన్‌లోని ఆముదాల అప్పలస్వామి కాలనీలో దివంగత వైఎస్సార్ విగ్రహం నుంచి పాదయాత్రగా ఎమ్మెల్యే నాని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేటర్ తంగెళ్ల రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి డివిజన్ నాయకులు, ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు గూడు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 30 లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో 30 వేల ఇళ్ల పట్టాలు అందజేశామని, 15 వేల ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రతి పేదవానికి ఉచితంగా అత్యుత్తమ స్థాయి వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. గతంలో ఆరోగ్యశ్రీ పథకంలో 1,200 వ్యాధులకు చికిత్సలు అందిస్తే, నేడు 3,250 వ్యాధులను చేర్చి పేదలకు మేలు చేస్తున్నారని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే నాని తెలిపారు. ఎమ్మెల్యే నాని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సాంకేతిక లోపంతో సంక్షేమ పథకాలు అందకపోతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్లు నున్నా స్వాతి శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, సుంకర చంద్రశేఖర్, కలవకొల్లు సాంబ, బత్తిన విజయ్‌కుమార్, కోయా సత్తిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచెన రామకృష్ణ, వాణిజ్య విభాగం మోటమర్రి సదానందం, పార్టీ నాయకులు జిజ్జువరపు రమేష్, ఇనుపనూరి జగదీష్, వైఎస్‌వీ శివరావ్, యల్లపు మోజెస్, పిట్టా ధనుంజయ్, గరికిముక్కు నాగదుర్గారావు, అబ్బిరెడ్డి రంగముత్యాలు, డెక్కత జయరామ్‌రెడ్డి, నగర కమిషన్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, పీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ బి.సోమశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



15వ డివిజన్‌లో మహిళకు సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాని

వైభవంగా నగరేశ్వర స్వామి రథోత్సవం



రథారూఢుడైన నగరేశ్వర స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ గంగ, వింధ్యవాసిని సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం, రాత్రి హోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి స్వామి వారి రథోత్సవాన్ని నగరంలోని పలు వీధుల్లో నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామపెద్దింట్ల రావు పర్యవేక్షించారు.

గొప్ప సామాజికవేత్త బాబూ జగ్జీవన్‌రామ్



కలెక్టరేట్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): సమాజంలో అణగారిన వర్గాలవారి హక్కుల కోసం అలుపెరిగిన పోరాటం చేసిన గొప్ప సామాజికవేత్త డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జగ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుకలను జ్యోతిని వెలిగించి కలెక్టర్ ప్రారంభించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సమాజంలో వర్ణ వివక్షతను రూపుమాపేందుకు జగ్జీవన్‌రామ్ అలుపెరుగని కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, నవరత్న పథకాలలో నిరుపేద షెడ్యూల్డ్ కులాల్లోని ప్రతి ఒక్కరికీ లబ్ధి అందిస్తోందని చెప్పారు. జేసీ పి.అరుణ్ బాబు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు, పాలిమేర హరికృష్ణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, అదనపు ఎస్పీ శేఖర్, ఆర్డీఓ పెంచెల్ కిశోర్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, తహసీల్దార్ సోమ శేఖర్, ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు మునుల జాన్ గురునాథ్, కార్పొరేటర్ పొలిమేర రాందాస్, కత్తిరి రామమోహనరావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు కమిటీ సభ్యులు, ప్రవల్లిక, షెడ్యూల్డ్ కులాల సంఘాల ప్రతినిధులు నేతల రమేష్ బాబు, కలపాలి రవి, బయ్యారపు రాజేశ్వర రావు , మెండెం సంతోష్ కుమార్, దాసరి ఆంజనేయులు, చాగంటి సంజీవ్, పాక ప్రభాకరరావు, ధనియాల శంకర్ పాల్గొన్నారు. అనంతరం ప్రజా రవాణా శాఖలో కారుణ్య నియామకాల ద్వారా నియామకం పొందిన వారికి ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు.

బీజేపీ పశ్చిమ మండలం ఆధ్వర్యంలో..

ఏలూరు (టూటౌన్): బీజేపీ పశ్చిమ మండలం ఆధ్వర్యంలో స్థానిక ఓవర్ బ్రిడ్జి డౌన్లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పశ్చిమ మండల అధ్యక్షులు నడపన దాన భాస్కరరావు మాట్లాడారు. మేకల శ్రీకృష్ణ దేవరాయలు, దొడ్ల శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.



ఓవర్ బ్రిడ్జి డౌన్లో నివాళులర్పిస్తున్న నాయకులు



ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ పొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో..

నరసింహారావుపేటలో..

ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ మాట్లాడారు. కొరబండి బాబూరావు, పల్లా యేసేబు, గారపాటి నాగేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

కబాడ్డీ కాలనీ, తంగెళ్లమూడిలో..

ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు మేతర అజయ్ బాబు, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావులు మాట్లాడారు. జగ్జీవన్ రామ్ గొప్ప సంఘ సంస్కర్త, పరిపాలన దక్షుడు, నిబద్ధతగల నాయకుడని కొనియాడారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు దండుబోయిన చంద్రశేఖర్, కొమ్మన సాంబశివరావు, సాకే బాబు ప్రసాదరావు, వైవీఎం మల్లేశ్వర రావు, ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, తాళ్లూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో..

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ ఆదర్శవంతమైన నాయకుడని కొనియాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు, పూరేటి శ్రీనివాస్, ఎంవీ శ్యాంబాబు, జి.వెంకటేశ్వర రావు, షేక్ ముస్తఫా అలీ పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజ్‌లో..

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, బహుజన సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఫోరం ఏలూరు డిపో కార్యదర్శి కె.బాబూ రావు, షేక్ సయ్యద్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు అతీతంగా 'బార్' ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగాయని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు తెలిపారు. ఇటీవల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన అబ్బినేని విజయ్ కుమార్ చేసిన రాజకీయ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు ఖండించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ సమీపంలోని ఓ ప్రైవేట్ హాలులో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు డీవీ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, చెల్లే రాజేంద్రప్రసాద్, టీఎస్ఎస్ఎన్ రెడ్డి, కోనే సీతారామారావు, ప్రత్తిపాటి తంబి, సీఏపీఎస్ ఆచార్యులు, వెంపటి స్టాన్లీ బాబు, మాండ్రు రాజేంద్రలు మాట్లాడారు. ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన అనంతరం అబ్బినేని చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు గతంలో మాదిరిగానే రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీని అప్రతిష్టపాలు చేసేందుకు దురుద్దేశంతోనే అబ్బినేని విజయ్‌కుమార్ తనను టీడీపీ బలపర్చినందునే భారీ మెజార్టీతో గెలిపించారని చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ పడిన ముగ్గురు అభ్యర్థుల్లో ఒకరు టీడీపీ సానుభూతిపరులు, ఇద్దరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు వచ్చిన మొత్తం ఓట్లు గెలిచిన అబ్బినేని విజయ్ కుమార్‌కు వచ్చిన ఓట్ల కన్నా ఎక్కువని వివరించారు. ఎన్నికల నామినేషన్లు, స్క్రూటినీ, ఎన్నికల రోజు లేని పార్టీ ముద్ర గెలిచేందుకు ఎందుకు రావాల్సి వచ్చిందని, తన స్వలాభం కోసం ఎన్నడూ ఏలూరు బార్ అసోసియేషన్‌లో లేని పార్టీల ప్రస్తావన ఎందుకు వచ్చిందంటూ ప్రశ్నించారు. అసలు బార్ అసోసియేషన్ ఎన్నికల గురించి స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల నానికి తెలియదని చెప్పారు. న్యాయవాదుల ఎన్నికలను సైతం పార్టీల ప్రస్తావన తీసుకొచ్చి, కావాలనే బురద చల్లడం సరికాదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు అబ్బినేనికి హితవుపలికారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): పెరుగుతున్న గృహ నిర్మాణ సామగ్రి ధరలకు అనుగుణంగా జగనన్న గృహ నిర్మాణానికి రూ.5లక్షల కేటాయించి లబ్ధిదారులను ఆదుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం కోరింది. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా అధ్యక్షులు మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాజనాల రామ్మోహన్‌రావు, కె.నాని, కడుపు కన్నయ్య, పుప్పాల కన్నబాబు, మావూరి విజయ తదితరులు మాట్లాడారు.

పాల దిగుబడి పెంచాలి

ఏలూరు రూరల్: రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం చొదిమెళ్లలో పర్యటించారు. పశువుల దాణా తయారి, పాల దిగుబడి, పశువుల్లో జీర్ణ వ్యవస్థ మెరుగుదలపై చర్చించారు. స్థానిక అంకెం వరప్రసాద్ పశువుల గొట్టాన్ని పరిశీలించారు. ఎండిగడ్డి, యూరియా, బెల్లంతో కలిపి దాణా తయారు చేసే విధానాన్ని రైతులకు చేసి చూపించారు.

విద్యుదాఘాతానికి మూడు గేదెలు మృతి

ఏలూరు రూరల్: విద్యుదాఘాతానికి గురై మూడు గేదెలు మృతి చెందాయి. పోణంగిలో ఓ రైతుకు చెందిన మూడు గేదెలు శ్రీపర్రు సరిహద్దులో చేపలు, పంటపొలాల గట్లపై పచ్చిక మేస్తున్నాయి. సాయంత్రం వేళ చెరువు గట్టు పరిసరాల్లో వెళుతూ తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాయి. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా మొదట్లో ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుగా ఏర్పాటు చేశామని, అయితే చెరువు యజమాని గట్టుపై మట్టి పోయడంతో ఎత్తు తగ్గిందన్నారు. చెరువు యజమానినే రైతుకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.

క్లుప్తంగా

షేర్ క్యాపిటల్‌పై వడ్డీ చెల్లింపులు చేయాలి

ఏలూరు (టూటౌన్): సహకార సంఘాలకు షేర్ క్యాపిటల్‌పై వడ్డీ చెల్లింపులు చేయాలని రైతులకు సహకారం ఉన్న సహకార సంఘాలను రక్షించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఉన్న 258 సహకార సంఘాల్లో అప్పులు తీసుకున్న రైతుల నుంచి 10 శాతం షేర్ క్యాపిటల్ వసూలు చేస్తారని తెలిపారు. షేర్ క్యాపిటల్‌ను డీసీసీబీకి సహకార సంఘాలు చెల్లిస్తాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం షేర్ క్యాపిటల్ సొమ్ముపై డివిడెండ్ లేదా ఆరు శాతం వడ్డీగాని డీసీసీబీ సహకార సంఘాలకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2010 - 11 నుంచి 2021-22 మధ్య కాలంలో డీసీసీబీకి వెళ్లిన సొమ్ము దాదాపుగా రూ.1275 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వడ్డీ రూపంలో సహకార సంఘాలకు రూ.76 కోట్లు రావాల్సి ఉండగా రూ.6 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపు కున్నారని వివరించారు. ఇప్పటికైనా డీసీసీబీ తన వైఖరిని మార్చుకుని సహకార సంఘాలకు చెల్లించాల్సిన డివిడెండ్ లేదా వడ్డీ సొమ్మును పూర్తిగా చెల్లించాలని కోరారు. డీసీసీబీలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని రవి కోరారు.

చలో ఢిల్లీ ర్యాలీలో ఏలూరు జిల్లా రైతులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై బుధవారం నిర్వహించిన చలో ఢిల్లీ కార్యక్రమంలో ఏలూరు జిల్లా నుంచి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, రైతాంగ ఆత్మహత్యలు నివారించాలంటూ నినదించారు. కార్మిక, కర్షక ఐక్యతతో జరిగిన ఢిల్లీ రామ్ లీలా మైదానంలో భారీ బహిరంగ సభలో జిల్లా రైతులు పాల్గొన్నారు. వీరిలో ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఎ.హారేరామ్, రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, బొడ్డు రాంబాబు, అనుమోలు మురళి, కొల్లి విజయభాస్కరెడ్డి, పల్లపోతు రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో అన్నసమారాధన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక చేపల మార్కెట్‌లో వీరాంజనేయ స్వామి ఆలయంలో ఇటీవల నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలు ముగింపు సందర్భంగా బుధవారం అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రారంభించారు. తొలుత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు శౌరిపురానికి చెందిన వ్యక్తి ఒంటరితనాన్ని భరించలేక తీవ్ర మానసిక వేదనతో తాను నివాసం ఉంటోన్న షెడ్డులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెయింటర్ దేవరకుంట హనుమంతరావు (34) గతంలో రెండు పెళ్లిళ్లు చేసుకోగా.. భార్యలు అతనితో విడిపోయారు. కొంతకాలంగా ఒంటరి తనాన్ని భరించలేక బుధవారం తన రేకుల షెడ్డులో ఫ్యాన్‌కు హనుమంతరావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు రామకృష్ణాపురం మినీ బైపాస్‌లో మంగళవారం రాత్రి కారు, మోటారుసైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏలూరుకు చెందిన కొయ్య నర్సింహారెడ్డి (38)కి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఏలూరు బోధనాసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అతను చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు ఏలూరు త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఐదుగురు బెట్టింగ్‌రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు టూటౌన్ పాములదిబ్బ ప్రాంతానికి చెందిన ఐతా వెంకటేశ్వరరావు, మరో ఐదుగురు క్రికెట్ బెట్టింగులు ఆడుతుండగా ఏలూరు టూటౌన్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.6 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తనకు ఇంటి స్థలం ఇప్పిస్తానని నమ్మించి రూ.1.50 లక్షలు తీసుకొని దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు కులం పేరుతో దూషించారని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన గొట్టాపు శ్రీధర్ అనే వ్యక్తి లంకపేట ప్రాంతానికి చెందిన చింతాటి జ్యోతి అనే మహిళకు ఇంటి స్థలం ఇప్పిస్తానని చెప్పి 2018 సంవత్సరంలో రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా స్థలం ఇవ్వకపోవడంతో ఆమె రెండు రోజుల క్రితం శ్రీధర్ ఇంటికి వెళ్లి అడిగింది. తాను ఇచ్చిన సొమ్ము వెనక్కి ఇవ్వాలని కోరగా ఆమెపై దాడి చేయడంతో పాటు కులంపేరుతో దూషించారంటూ ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఎస్సై కె.ప్రసాద్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న హేమ సురేష్

ఏలూరు (టూటౌన్): బీసీలకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో రావాల్సిన సీట్లు, రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ భీమవరపు హేమ సురేష్ కోరారు. ఈ నెల మూడు, నాలుగు తేదీల్లో ఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆమె పాల్గొన్నారు. ఆ వివరాలను బుధవారం ఏలూరులో ఆమె వివరించారు. బీసీల అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం నేటికీ బీసీల లెక్కలు సేకరించకపోవడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు భీమవరపు సురేష్ కుమార్, పలువురు బీసీ నాయకులు, మహిళలు పాల్గొన్నట్టు హేమ సురేష్ తెలిపారు.

డీఈఓకు ఉపాధ్యాయుల వినతి



డీఈఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవి సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. 10వ తరగతి మూల్యాంకనం విధుల నుంచి 55 సంవత్సరాల వయసు దాటిన వారికి, వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులకు, బాలింతలకు, ఏలూరు నగరానికి సుదూర ప్రాంతాలు, ఏజెన్సీతో పాటు ఆగిరిపల్లి మండలం లాంటి దూరప్రాంత మండలాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పూర్తి మినహాయింపు ఇవ్వాలని కోరారు. 10వ తరగతి పరీక్షలు జరిగే రోజుల్లో పూర్తి సెలవు ప్రకటించి వాటి పరిహార పనిదినాలుగా నాలుగు ఆదివారాలతో పాటు పవిత్ర రంజాన్, గుడ్‌ఫ్రైడే, అంబేద్కర్ జయంతిలను ప్రకటిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సస్పెన్షన్ విచారణలను పూర్తి చేయించడంతో పాటు దరఖాస్తు చేసుకున్న వివిధ సమస్యల పరిష్కారం విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు, రాష్ట్ర కౌన్సిలర్ బెజవాడ ధర్మారావు, రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీహరి శివప్రసాద్, పెదపాడు మండల ప్రధాన కార్యదర్శి మురసోలి ఉన్నారు.

16న యాదవ నగర కమిటీ ప్రమాణ స్వీకారం



బ్రోచర్ విడుదలచేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర యాదవ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఈ నెల 16న మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో భాగంగా బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఏలూరు నగర యాదవ సంఘం అధ్యక్షునిగా బొట్టా అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జంకుల సతీష్, కోశాధికారిగా బోగ రాజేష్, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి హాజరవుతారని చెప్పారు. జిల్లా, నగర యాదవ సంఘం నాయకులు, పెద్దలు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిలారు బుజ్జి, నాయకులు హరినాథ్‌బాబు, ముస్సే శ్రీనివాసరావు, దిమ్మిటి రమేష్ పాల్గొన్నారు.